క్లుప్తంగా

నాణ్యత ప్రమాణాలు పాటించకపోతే చర్యలు



పనులు పరిశీలిస్తున్న కమిషనర్ గణేశ్‌రెడ్డి

దుబ్బాకటౌన్: డ్రైనేజీ నిర్మాణంలో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ పాతూరి గణేశ్‌రెడ్డి అన్నారు. మంగళవారం దుబ్బాక మున్సిపల్ పరిధిలోని చెల్లాపూర్ 2వ వార్డులో టీయూఎఫ్ఐడీసీ నిధులతో నిర్మిస్తున్న సీసీ డ్రైనేజీ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పనులు నాణ్యతగా చేపట్టాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. నాణ్యత విషయంతో ఎట్టి పరిస్థితుల్లో రాజీ పడేది లేదన్నారు. నిబంధనల మేరకు పనులు చేపట్టాలన్నారు. మున్సిపల్ పరిధిలోని ఆయా వార్డుల్లో డ్రైనేజీల నిర్మాణ పనులు చురుకుగా జరుగుతున్నాయన్నారు.

రైతుల ఆదాయంపై పన్ను వేసే కుట్ర

గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్

గజ్వేల్: రైతుల ఆదాయంపై పన్ను వేసే కుట్రతో కేంద్రం ముందుకుసాగుతుందని గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ ఆరోపించారు. మంగళవారం గజ్వేల్‌లోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్రం తీరుపై మండిపడ్డారు. అసంబద్ధ విధానాలతో ఇప్పటికే రైతులను మోసం చేస్తున్న కేంద్రం రైతులపై మరోసారి భారీ కుట్రకు తెరలేపిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మెజారిటీ ప్రజలకు జీవనాధారమైన వ్యవసాయ రంగం నడ్డి విరిచే చర్యలు సహించరానివని పేర్కొన్నారు. కేంద్రం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు కేసీఆర్‌తో కలిసి నడవాలని ఆయన ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

చిరు ధాన్యాలపై పరిశోధన

సిద్దిపేటఎడ్యుకేషన్: మానవుల ఆరోగ్యంపై చిరుధాన్యాల ప్రభావం అనే అంశంపై జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాల మైక్రోబయాలజీ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం స్టూడెంట్స్ స్టడీ ప్రాజెక్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ ప్రసాద్ మాట్లాడుతూ.. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థులతో పాటు ప్రజలకు ఉపయోగపడుతాయన్నారు. ప్రస్తుత యాంత్రిక జీవనంలో ప్రతి ఒక్కరూ చిరు ధాన్యాల ద్వారా కలిగే లాభాలను తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రాజెక్టు పర్యవేక్షకులు డాక్టర్ పల్లవి, విద్యార్థులు ప్రియాంక, హిమజ, నవీన్‌కుమార్, భరత్, నాగసాయి, దీక్షిత్ తదితరులు పాల్గొన్నారు.

బాలికలు ఉన్నత శిఖరాలను చేరుకోవాలి

గజ్వేల్‌రూరల్: ఆడపిల్లలు సరైన మార్గంలో నడిచి ఉన్నత శిఖరాలను చేరుకోవాలని గజ్వేల్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీవీ ఉమాశశి పేర్కొన్నారు. జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా మంగళవారం గజ్వేల్ పట్టణంలోని బాలికల ఎడ్యుకేషన్ హబ్‌లోగల ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఉమాశశి మాట్లాడుతూ.. ఆడవారిని గౌరవించే సమాజం పురోగమిస్తుందని, ఆడపిల్లల అభివృద్ధితో సమాజం, దేశం అభివృద్ధి పథంలో ముందుకు వెళ్తుందన్నారు. ఆడపిల్లలు తమ బలహీనతలను అధిగమిస్తే ఉన్నత స్థానానికి చేరుకోవచ్చన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు బాలికల విద్య, రక్షణ, బాలికలకు, స్త్రీలకు గల ప్రభుత్వ పథకాలు, ప్రోత్సాహకాలపై కళాశాల మహిళా సాధికారత విభాగం అధ్యక్షురాలు సౌజన్య అవగాహన కల్పించారు.

ఆరోగ్య ఉపకేంద్రం పనుల పరిశీలన

కొండపాక(గజ్వేల్): ఈనెల 27న కుకునూరుపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రంలో అందుతున్న వైద్య సేవల విషయమై జాతీయ నాణ్యత ప్రమాణాల బృందం పరిశీలనకు వస్తున్న నేపథ్యంలో సర్పంచ్ పాల్కంపల్లి జయంతి ఆరోగ్య ఉపకేంద్రం పరిసర మైదానంలో టిప్పర్లతో మట్టి పోయించి చదును చేయించారు. ఈ పనులను డిప్యూటీ డీఎంహెచ్ఓ శ్రీనివాస్ పరిశీలించారు. ఆస్పత్రి పనితీరు భేష్‌గా నిలిచేలా కృషి చేస్తున్న సర్పంచ్ జయంతిని ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో జిల్లా క్వాలిటీ టీం సభ్యులు పుల్లగూర్ల శ్రీనివాస్‌రెడ్డి, ఆస్పత్రి వైద్యులు బల్‌బీర్‌సింగ్, సూపర్‌వైజర్ భువనేశ్వర్‌రెడ్డి, పీఎస్ఆర్ ట్రస్టు నిర్వాహకులు పాల్కంపల్లి నరేందర్, పంచాయతీ కార్యదర్శి మమత, గ్రామ పంచాయతీ కార్యాలయ బిల్ కలెక్టర్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యల పరిష్కారంపై నిర్లక్ష్యం వీడాలి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విద్యార్థి వ్యతిరేక విధానాలు నశించాలని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్(ఏబీవీపీ) జిల్లా కన్వీనర్ వివేక్ అన్నారు. విద్యార్థుల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్య ధోరణి వీడాలని మంగళవారం స్థానిక ముస్తాబాద్ చౌరస్తాలో కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఆయా జోనల్ ఇన్‌చార్జులు సంతోష్, సంజయ్, ఫణిందర్, హరీశ్, శ్రీశైలం, ప్రవీణ్ పాల్గొన్నారు.

ఉత్సవాలకు ఆలయాలు ముస్తాబు

- నేటి నుంచి రెండు రోజుల పాటు సందడి
- కొంగుబంగారంగా అనంతసాగర్ సరస్వతీమాత
- సర్వం సిద్ధం చేసిన నిర్వాహకులు





అనంతసాగర్ సరస్వతీ క్షేత్రం(ఇన్‌సెట్‌లో) అమ్మవారి మూలవిరాట్

చిన్నకోడూరు(సిద్దిపేట): పచ్చని చెట్లు.. ప్రశాంత వాతావరణం.. కొండల వరుసలు.. పక్షుల కిలకిల రాగాలు.. చుట్టూ గుట్టలు దట్టని అడవులు, సహజ సిద్ధంగా ఏర్పడిన జలగుహల సోయగాల మధ్య ప్రకృతి ఒడిలో వీణపాణి సరస్వతీ మాత కొలువుదీరింది. దేశంలోనే రెండో సరస్వతీ క్షేత్రంగా విరాజిల్లుతూ భక్తుల విశేష పూజలు అందుకుంటోంది చిన్నకోడూరు మండలం అనంతసాగర్ సరస్వతీ క్షేత్రం. ఈ ఆలయంలో అక్షరాభ్యాసం చేయిస్తే పిల్లలు ప్రతిభావంతులు అవుతారని భక్తుల విశ్వాసం. ఏటా సరస్వతీ జన్మదినం రోజు అక్షరాభ్యాసాలతో ఆలయ పరిసరాలు కిటకిటలాడుతాయి. ఈ నెల 26న సరస్వతీ మాత జన్మదినాన్ని (వసంత పంచమి) పురస్కరించుకొని ప్రతీ ఏటా నిర్వహించే ఆలయ వార్షికోత్సవాలకు ఆలయాన్ని ముస్తాబు చేశారు. 25 నుంచి 27 వరకు మూడురోజుల పాటు ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు.

ఆలయ చరిత్ర..

చిన్నకోడూరు మండలం అనంతసాగర్ శివారులో పూర్వ కాలంలోనే సహజ సిద్ధంగా ఐదు జలగుహలు ఏర్పడ్డాయి. వీటిని నేడు భక్తులు దోనెలుగా పిలుస్తున్నారు. దోనెల్లో మాఘ అమావాస్య రోజున స్నానం చేస్తే పుణ్యం లభించి మంచి జరుగుతుందనేది ఇక్కడి ప్రజల నమ్మకం. క్రమక్రమంగా వీటిలో రెండు దోనెలు మూసుకుపోగా ప్రస్తుతం రాగి, పాల, చీకటి దోనెలు మాత్రం మిగిలాయి. వీటిలో ఏడాది పొడవునా నీరు ఉండటం విశేషం. ఇక్కడే సిద్దిపేటకు చెందిన అష్టావధాని అష్టకాల నరసింహరామశర్మ 1980 మే 2న ఆలయానికి శంకుస్థాపన చేశారు. పదేళ్ల పాటు శ్రమించి ఆలయాన్ని పూర్తి చేసి 1990 జనవరి 1న నిల్చుని ఉన్న సరస్వతీ మాత విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. నాటి నుంచి దినదినాభివృద్ధి చెందుతూ వీణపాణి అయిన సరస్వతీ మాత భక్తులకు ఆరాధ్యదైవంగా మారింది. క్షేత్రంలో సౌభాగ్యలక్ష్మి, మహాంకాళీ, హనుమాన్ విగ్రహాలను ప్రతిష్ఠించారు. అలాగే రాజగోపురంతో పాటు ధ్యాన మందిరాన్ని, యజ్ఞ మంటపం, యాత్రికుల గదులు, నిత్యాన్నదాన సత్రాన్ని నిర్మించారు. ఈ ఉత్సవాలకు సిద్దిపేట, కరీంనగర్, సిరిసిల్లా జిల్లాలకు చెందిన వేల మంది భక్తులు ఉత్సవాల్లో పాల్గొని సరస్వతీ మాత ఆశీస్సులు పొందుతారు.

పద్మనాభస్వామి ఆలయం సిద్ధం



దుబ్బాకటౌన్: కోరిన భక్తుల కొంగుబంగారంగా ప్రసిద్ధిగాంచిన అనంత మహాలక్ష్మి పద్మనాభ స్వామి ఆలయం 22వ వార్షికోత్సవాలకు సిద్ధమైంది. దుబ్బాక మున్సిపల్ పరిధిలోని చేర్వాపూర్ వద్ద వెలసిన అనంత మహాలక్ష్మిపద్మనాభస్వామి ఆలయం అనతి కాలంలోనే గొప్ప ఆలయంగా ప్రసిద్ధి చెందింది. ఈ నెల 25 నుంచి రెండు రోజుల పాటు జరిగే ఉత్సవాలకు ఆలయం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది.

రోజువారీ కార్యక్రమాలు..

ఉత్సవాలు బుధవారం నుంచి రెండు రోజుల పాటు జరుగుతాయి. బుధవారం ఉదయం 8 గంటలకు విఘ్నేశ్వర పూజ–పుణ్యాహవచనంతో ఉత్సవాలు ప్రారంభం అవుతాయి. మధ్యాహ్నం అన్నదానం కార్యక్రమం ఏర్పాటు చేశారు. శ్రీ మాధవానంద సరస్వతీ స్వామిజీతో పాటు పలువురు స్వామిజీల ఆధ్వర్యంలో సువాసినీలతో సామూహిక కుంకుమార్చనలు, భక్తులకు అనుగ్రహ భాషణం నిర్వహిస్తారు. ఉత్సవాల సందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున హాజరుకానుండడంతో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ ఉత్సవాలకు ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే మాధవనేని రఘునందన్‌రావులతో పాటు పలువురు ప్రముఖులు హాజరుకానున్నారు.

అంధత్వ నివారణకే ‘కంటి వెలుగు’



అనంతగిరిపల్లి శిబిరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి



దుబ్బాక: వివరాలు తెలుసుకుంటున్న డీఎల్‌పీఓ మల్లికార్జున్

వర్గల్(గజ్వేల్): అంధత్వ నివారణ లక్ష్యంగా సీఎం కేసీఆర్ ‘కంటి వెలుగు’ కార్యక్రమం ప్రారంభించారని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి అన్నారు. మంగళవారం వర్గల్ మండలం అంబర్‌పేటలో కంటివెలుగు శిబిరం సందర్శించారు. అనంతరం గ్రామంలో పాఠశాల భవన నిర్మాణ పనులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గఢా ఓఎస్డీ ముత్యంరెడ్డి, డీపీఓ దేవకీదేవి, జెడ్పీటీసీ బాలూయాదవ్, ఎంపీపీ లతరమేశ్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ రామకృష్ణారెడ్డి, సర్పంచ్ సునితరమణారెడ్డి, ఎంపీటీసీ వెంకటేశ్‌గౌడ్, ఎంపీడీవో స్వర్ణకుమారి, మండల వైద్యాధికారిణి డాక్టర్ హరిత పాల్గొన్నారు.

హుస్నాబాద్: కంటి చూపు సరిగా ఉంటేనే ప్రపంచాన్ని చూడగలుగుతామని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత అన్నారు. పట్టణంలోని 12వ వార్డులో మంగళవారం కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, కమిషనర్ రాజమల్లయ్య, కౌన్సిలర్ గూళ్ల రాజు, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ సౌమ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గజ్వేల్‌రూరల్: గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీతో పాటు మండల పరిధిలోని అహ్మదీపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన కంటివెలుగు కేంద్రాలను మంగళవారం అధికారులు సందర్శించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ పరిధిలోని 1వ వార్డులో ఏర్పాటు చేసిన కంటివెలుగు వైద్య శిబిరాన్ని జిల్లా కంటివెలుగు ప్రత్యేకాధికారి సరోజన, మున్సిపల్ కమిషనర్ విద్యాధర్‌తో కలిసి సందర్శించారు. ఇక్కడ ప్రజలకు అందిస్తున్న వైద్యసేవలను అడిగి తెలుసుకున్నారు. అలాగే మండలంలోని అహ్మదీపూర్‌లో ఏర్పాటు చేసిన కంటివెలుగు కేంద్రాన్ని డీపీవో దేవకీదేవి సందర్శించారు.

హుస్నాబాద్‌రూరల్: బంజేరుపల్లిలో కంటి వెలుగు శిబిరాన్ని ఎంపీపీ లకావత్ మానసతో కలిసి జెడ్పీ వైస్ చైర్మన్ రాయిరెడ్డి రాజిరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ బాలస్వామి, తదితరులు పాల్గొన్నారు.

నిర్భయంగా పరీక్షలు చేయించుకోవాలి

దుబ్బాక: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన కంటి వెలుగు పథకంలో భాగంగా శిబిరాల్లో ప్రజలందరూ నిర్భయంగా కంటి పరీక్షలు చేయించుకోవాలని డీఎల్‌పీఓ మల్లికార్జున్ అన్నారు. మంగళవారం దౌల్తాబాద్ మండల కేంద్రంలో కంటి వెలుగు కేంద్రాన్ని ఆయన సందర్శించారు. రోజు పరీక్షలు ఎన్ని చేస్తున్నారని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాజేష్, ఎంపీఓ గఫూర్ ఖాద్రీ, గ్రామ కార్యదర్శి యాదగిరి, తదితరులున్నారు.

కొమురవెల్లి(సిద్దిపేట): మండలంలోని అయినాపూర్ గ్రామంలో కొనసాగుతున్న కంటి వెలుగు శిబిరాన్ని కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయ చైర్మన్ గీస భిక్షపతి, జెడ్పీటీసీ సిద్దప్ప, నాయకులు సార్ల కిష్టయ్య, కిషన్‌తో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా పరీక్షలు చేయించుకున్నావారికి అద్దాలను పంపిణీ చేశారు. అనంతరం ఉన్నత పాఠశాలకు రూ.12లక్షలతో నిర్మించనున్న ప్రహరీ నిర్మాణానికి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రమణారెడ్డి, వైస్ ఎంపీపీ కాయిత రాజేందర్‌రెడ్డి, ఎంపీవో మంజుల, పంచాయతీ కార్యదర్శి బాలరాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గీత కార్మికుల అభ్యున్నతికి కృషి

ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి



దుబ్బాకటౌన్: భవన నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎంపీ ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాకటౌన్: గీత కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం అన్ని విధాలుగా కృషి చేస్తుందని ఎంపీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం దుబ్బాక పట్టణంలో రూ.20 లక్షలతో గౌడ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కల్లుగీత వృత్తిపై ఆధారపడ్డ గౌడ కులస్తులకు ప్రభుత్వం అనేక పథకాలు అందిస్తుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనితభూంరెడ్డి, కౌన్సిలర్ యాదమ్మఎల్లం, గౌడ సంఘం నాయకులు పల్లె వంశీకృష్ణాగౌడ్, పల్లె రామస్వామిగౌడ్, పల్లె శ్రీనివాస్‌గౌడ్ తదితరులు ఉన్నారు. పట్టణంలో జరుగుతున్న కంటి వెలుగు శిబిరంను ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఇప్పటివరకు ఎంత మందికి పరీక్షలు చేశారు, అద్దాలు ఎంత మందికి ఇచ్చారు తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. పట్టణంలోని మార్కండేయ ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

గ్రామాల అభివృద్ధికి సహకరిస్తా

తొగుట(దుబ్బాక): మండలాన్ని ప్రగతి పథంలో నడిపించేందుకు తనవంతు సహకారం అందిస్తానని ఎంపీ ప్రభాకర్‌రెడ్డి స్పష్టం చేశారు. మండలంలోని గుడికందుల గ్రామంలో ఎస్సీ కమ్యూనిటీ భవన నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ మల్లయ్య, పీఏసీఎస్ చైర్మన్ హరికృష్ణారెడ్డి, ఏఎంసీ చైర్మన్ కొమురయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాంరెడ్డి, ఆయా గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

నిర్వాసితుల సహకారంతో ప్రాజెక్ట్ పూర్తి చేస్తాం

హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్



హుస్నాబాద్: లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే సతీశ్‌కుమార్

హుస్నాబాద్: గౌరవెల్లి ప్రాజెక్టును భూ నిర్వాసితుల సహకారంలో పూర్తి చేసి ప్రాజెక్టులో గోదావరి జలాలను నింపుతామని ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ అన్నారు. హుస్నాబాద్ మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో హుస్నాబాద్ పట్టణం, హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ మండలాలకు చెందిన 46 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు, సీఎం సహాయ నిధి ద్వారా 21 మంది లబ్ధిదారులకు చెక్కులు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ మాట్లాడుతూ.. గౌరవెల్లి ప్రాజెక్టు ద్వారా లక్ష ఎకరాలకు సాగునీరు అందించి హుస్నాబాద్ నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేస్తామన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గాన్ని అతి వేగంగా అభివృద్ధి చేసుకుంటున్నామని తెలిపారు. ఎల్కతుర్తి నుంచి సిద్దిపేట వరకు జాతీయ రహదారి పనులు ప్రారంభమయ్యాయని, జాతీయ రహదారితో ఈ ప్రాంతం రవాణా పరంగా, పారిశ్రామికంగా ఎంతో అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రజలు, ప్రజాప్రతినిధుల సహకారంతో హుస్నాబాద్ మున్సిపాలిటీకి స్వచ్ఛ సర్వేక్షణ్ కింద రెండు జాతీయ అవార్డులు సాధించుకోగలిగామన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ రాయిరెడ్డి రాజిరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, ఎంపీపీలు లకావత్ మానస, మాలోతు లక్ష్మి, కొక్కుల కీర్తి, జెడ్పీటీసీ భూక్య మంగ, కౌన్సిలర్లు, గ్రామాల ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అక్కన్నపేట(హుస్నాబాద్): మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ తాగునీరు దాహం తీరిందని ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ అన్నారు. అక్కన్నపేట మండల కేంద్రంతో పాటు జనగామ, రేగొండ గ్రామాల్లో నూతనంగా నిర్మించనున్న మిషన్ భగీరథ ఓవర్ హెడ్ ట్యాంక్‌ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ రాజిరెడ్డి, ఎంపీపీ లక్ష్మి, జెడ్పీటీసీ మంగ, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సాంబరాజు పాల్గొన్నారు.

చదువుతోనే సమాజంలో గుర్తింపు



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న సూపరింటెండెంట్ హేమరాజ్‌సింగ్

దుబ్బాక: చదువుతోనే సమాజంలో మంచి గుర్తింపు వస్తుందని, చిన్న తనంలోనే విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకొని లక్ష్యం దిశగా ముందుకు సాగాలని దుబ్బాక ప్రభుత్వ వంద పడకల ఆస్పత్రి సూపరింటెండెంట్ హేమరాజ్‌సింగ్ అన్నారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని దుబ్బాక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పరిసరాలు–వ్యక్తిగత పరిశుభ్రత అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. మండల విద్యాధికారి జోగు ప్రభుదాస్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు నారాయణరావు, హెచ్ఎం గాజుల రాంచంద్రం, ఉపాధ్యాయులు తదితరులున్నారు.

పేద ప్రజల సంక్షేమమే ధ్యేయం



మద్దూరు(హుస్నాబాద్): చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ముత్తిరెడ్డి

దుబ్బాకటౌన్: పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందని దుబ్బాక మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనితాభూంరెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని 18వ వార్డులో పలు బాధిత కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ పథకం కింద మంజూరైన చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షులు తుమ్మ భానుచందర్, గోనె మధు తదితరులు ఉన్నారు.

మద్దూరు(హుస్నాబాద్): నిరుపేదల ఆరోగ్యానికి సీఎం రిలీఫ్ ఫండ్ భరోసా కల్పిస్తుందని జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి అన్నారు. మంగళవారం దూళ్మిట్ట మండలంలోని జాలపల్లి గ్రామానికి చెందిన అల్లాడి రాజుకు మంజూరైన చెక్కును ఆయన అందజేశారు. కార్యక్రమంలో ముదిరాజ్ మండల అధ్యక్షుడు చొప్పరి సాగర్ తదితరులు పాల్గొన్నారు.

కూడవెల్లి హుండీ ఆదాయం రూ.3.50లక్షలు



హుండీని లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

దుబ్బాకరూరల్: మాఘ అమావాస్య జాతర సందర్భంగా భూంపల్లి మండలంలోని కూడవెల్లి రామలింగేశ్వరస్వామి ఆలయ హుండీ ఆదాయాన్ని మంగళవారం లెక్కించారు. హుండీ ఆదాయాన్ని సిద్దిపేట ఈఓ కే.రవికుమార్ పర్యవేక్షణలో లెక్కించారు. మొత్తం ఆదాయం రూ.3లక్షల 50 వేలు వచ్చినట్లు ఆలయ ఈఓ విశ్వనాథశర్మ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పూజారి చంద్రం, ఏఎస్ఐ భిక్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

తడి, పొడి చెత్తపై అవగాహన



కార్మికులకు అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ కమిషనర్ రాజమల్లయ్య

హుస్నాబాద్: స్వచ్ఛ సర్వేక్షణ్ 2023లో భాగంగా తడి, పొడి చెత్త వేరుచేసే విధానంపై మున్సిపల్ కమిషనర్ రాజమల్లయ్య మంగళవారం ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించి సన్మానించారు. ఈ సందర్భంగా కమిషనర్ రాజమల్లయ్య మాట్లాడుతూ.. ప్రతి ఇంటి నుంచి సేకరించిన తడి, పొడి చెత్తను వేరుచేసి మున్సిపల్ వాహనాల్లో డంపింగ్‌యార్డుకు తరలించాలన్నారు. పొడి చెత్త గతేడాది మార్చి నుంచి నవంబర్ వరకు ఎక్కువ క్వాంటిటీ తీసుకొచ్చిన ఆటో డ్రైవర్లు ఖాతాబాబా, కోరేపు రమేశ్‌లను సన్మానించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, జూనియర్ అసిస్టెంట్ శంకర్, ఎన్విరాన్మెంట్ ఇంజినీర్ రవికుమార్, డీఆర్‌సీసీ ఆపరేటర్ సమత, జవాన్లు సారయ్య, ప్రభాకర్, డ్రైవర్లు పాల్గొన్నారు.

వసంత పంచమి రోజు వర్గల్‌కు ప్రత్యేక బస్సులు

గజ్వేల్‌రూరల్: వసంత పంచమి పురస్కరించుకొని వర్గల్‌లోని సరస్వతీమాతను దర్శించుకునే భక్తుల కోసం జీపీపీ డిపో ఆధ్వర్యంలో ప్రత్యేక బస్సులను నడుపనున్నట్లు జీపీపీ(గజ్వేల్–ప్రజ్ఞాపూర్) ఆర్టీసీ డిపో మేనేజర్ సురేఖ పేర్కొన్నారు. మంగళవారం విలేకరులతో ఆమె మాట్లాడుతూ.. 26వ తేదీన జేబీఎస్, సిద్దిపేట, గజ్వేల్, గౌరారం కమాన్ నుంచి వర్గల్ వరకు బస్సులు నడిపిస్తామన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ నియామకం

అక్కన్నపేట(హుస్నాబాద్): తెలంగాణ అంబేడ్కర్ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా తొందురూ ఎల్లయ్య నియామకమయ్యారు. మంగళవారం ఆ సంఘం రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షుడు నర్సయ్య, రాష్ట్ర అధికార ప్రతినిధి తూముల సదానందం నియామక పత్రాలను అందజేశారు.

◆ ‘కేంద్రం నిధులతోనే పల్లెలు అభివృద్ధి’

మర్కూక్(గజ్వేల్): కేంద్ర ప్రభుత్వ నిధులతోనే గ్రామాలు అభివృద్ధి జరుగుతున్నాయని బీజేపీ మండల అధ్యక్షుడు రమేష్‌గుప్తా అన్నారు. మంగళవారం మర్కూక్‌లో మాట్లాడుతూ.. మండలంలోని పలు గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వ సహకారంతోనే పలు అభివృద్ధి పనులు జరిగాయని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం అసత్య ప్రచారాలు చేస్తూ ప్రజల్ని మభ్య పెడుతున్నారని ఆరోపించారు. సీఎం దత్తత గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వం నుంచి నిధుల ఎన్ని వచ్చాయో లెక్క తేల్చినట్లు వివరించారు. సమావేశంలో నాయకులు తిరుపతిరెడ్డి, మహేష్, శ్రీకాంత్‌రెడ్డి, బాల్‌రెడ్డి, బాల్‌రాజు, రాంచంద్రంచ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

◆ ఎమ్మెల్యే బహిరంగ చర్చకు సిద్ధం కావాలి

చేర్యాల(సిద్దిపేట): రెండు రోజుల క్రితం నియోజకవర్గ పర్యటన సందర్భంగా జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలు సరైనవికాదని, కేంద్రం రాష్ట్రానికి ఎలాంటి నిధులు ఇవ్వడం లేదని చెప్పిన మాటపై ఎమ్మెల్యే బహిరంగ చర్చకు సిద్ధమా అని బీజేపీ జిల్లా కార్యదర్శి బూరుగు సురేశ్‌గౌడ్ సవాల్ విసిరాడు. మంగళవారం పట్టణ కేంద్రంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు కాటం సురేందర్, రూరల్ మండల అధ్యక్షుడు కాశెట్టి పాండు అధ్యక్షతన జరిగిన సమావేశంలో సురేష్ మాట్లాడుతూ.. దీనిపై ఎమ్మెల్యే బహిరంగ చర్చకు సిద్ధంగా ఉండాలని, చేర్యాల అంబేడ్కర్ చౌరస్తా, జనగామ అంబేడ్కర్ చౌరస్తా ఎక్కడైనా తాము సిద్ధమన్నారు. సమావేశంలో బీజేపీ నాయకులు రామదాసు, షాదుల్లా, చంద్రశేఖర్‌రెడ్డి, మహేష్ పాల్గొన్నారు.

◆ కార్మికులకు జీతాలు ఇవ్వాలి

సిద్దిపేటరూరల్ : జిల్లా వ్యాప్తంగా పలు మండలాల్లోని కార్మికులకు వేతనాలు రాక ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే ప్రభుత్వం జీతాలు అందించి కార్మికులకు ఆదుకోవాలని గ్రామపంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి తునికి మహేశ్ అన్నారు. మంగళవారం నారాయణరావుపేట మండల పరిధిలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పండుగ సందర్భంగా కార్మికుల జీతాలు రాక పస్తులు ఉండాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని లేనిపక్షంలో సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ముట్టడించేందుకు సిద్ధమవ్వాలని కార్మికులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు నరేశ్, కార్మికులు పాల్గొన్నారు.

ఘనంగా మార్కండేయ జయంతి



దుబ్బాక: పూజలు చేస్తున్న నాగేశ్వర్‌రెడ్డి, తదితరులు



దుబ్బాక: నృత్యం చేస్తున్న చిన్నారులు

గజ్వేల్‌రూరల్: మార్కండేయ స్వామి జయంతి సందర్భంగా పట్టణంలోని రామాలయ ఆవరణలోగల మార్కండేయ ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం గణపతిపూజతో మొదలైన కార్యక్రమాలు మధ్యాహ్నం వరకు కొనసాగాయి.

పద్మశాలీ సంఘం అభివృద్ధికి కృషి చేస్తా

దుబ్బాక: దుబ్బాక పద్మశాలీ సంఘం అభివృద్ధికి అన్ని విధాల కృషి చేస్తానని ఎంజేబీ ట్రస్ట్ అధినేత, బీఆర్ఎస్ నాయకులు మద్దుల నాగేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం దుబ్బాక పట్టణంలోని మార్కండేయ ఆలయంలో మార్కండేయ జయంతి ఉత్సవాల్లో ఆయన పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఉత్సవాలకు ఆయన రూ.50 వేల విరాళాన్ని సంఘం సభ్యులకు అందించారు. కార్యక్రమంలో పద్మశాలీ సంఘం రాష్ట్ర నాయకులు గుర్రాల మల్లేశం, జిల్లా అధ్యక్షుడు డాక్టర్ సతీష్, నాయకులు అంకం మధు, పద్మశాలీ సంఘం అధ్యక్షుడు తిరుపతి, యువజన సంఘం అధ్యక్షుడు రాజు, నాయకులు స్వర్గం శ్రీకాంత్, వెంకటేశ్, సురేష్, నరేశ్, తదితరులున్నారు.

పట్టణంలోని మార్కండేయ ఆలయంలో వేద పండితులు శ్రీమన్ శ్రీ రాంబాబు భార్గవ ఆధ్వర్యంలో ఉదయంస్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం మార్కండేయుని విగ్రహంతో శోభయాత్ర నిర్వహించారు. శోభాయాత్రలో భాగంగా చిన్నారులు వివిధ వేషాధారణలతో, సాంస్కృతిక నృత్యాలతో అలరించారు.

వరిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



చేర్యాల(సిద్దిపేట): వరినాట్లను పరిశీలిస్తున్న ఏఓ అఫ్రోజ్



దిలాల్‌పూర్‌లో వరి సాగును పరిశీలిస్తున్న ఆత్మ కమిటీ చైర్మన్ ఊడెం కృష్ణారెడ్డి తదితరులు

గజ్వేల్: సమగ్ర సస్యరక్షణ చర్యలతోనే యాసంగి వరి పంటను కాపాడుకోవాలని గజ్వేల్ ఆత్మ(అగ్రికల్చర్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఏజెన్సీ) చైర్మన్ ఊడెం కృష్ణారెడ్డి సూచించారు. మంగళవారం గజ్వేల్ మండలం దిలాల్‌పూర్, శేర్‌పల్లి గ్రామాల్లో గజ్వేల్ ఏడీఏ బాబునాయక్‌తో కలిసి వరి పంట పొలాలను పరిశీలించారు.

మర్కూక్(గజ్వేల్): వరిలో మొగి పురుగు నివారణకు రైతులు వ్యవసాయ అధికారులు సూచనలు పాటించాలని సహాయ వ్యవసాయ సంచాలకుడు అనిల్‌కుమార్, ఏఓ నాగేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లో వరి పంటలను పరిశీలించారు.

కొమురవెల్లి(సిద్దిపేట): వరి పంట దశను బట్టి పురుగు మందులు పిచికారీ చేయాలని ఏఈఏ రాధిక సూచించారు. మంగళవారం మండలంలోని రాంసాగర్, అయినాపూర్, తపాస్‌పల్లి, కిష్టంపేట కొమురవెల్లి గ్రామాల్లో వరి పంట పొలాలను మండల వ్యవసాయాధికారి నరేశ్‌తో కలసి సందర్శించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ.. నాటు వేసి పిలుక దశలో ఉన్న వరి పంటలో మొదటగా కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 4జి గుళికలు ఎకరానికి 8 కిలోలు లేదా క్లోర్ న్యాట్రిప్రోల్ 0.4జి ఎకరానికి 4 కిలోలు చల్లుకోవాలని తెలిపారు.

చేర్యాల(సిద్దిపేట): మారుతున్న వాతావరణ పరిస్థితుల దృష్ట్యా చలి తీవ్రత పెరుగుతున్నందున వరికి మొగి పురుగు, కాండం తొలిచే పురుగు ఆశిస్తుందని, దాని నివారణకు తక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయ అధికారి అఫ్రోజ్ సూచించారు. మంగళవారం మండలంలోని వీరన్నపేట, ముస్త్యాల గ్రామాల్లో వరిపైరును ఆయన పరిశీలించారు. ఆయన వెంట వ్యవసాయ విస్తరణ అధికారి సారిక, రైతులున్నారు.

బెజ్జంకి(సిద్దిపేట): ఇటీవల వరి చేలకు వస్తున్న మొగి పురుగు ఉధృతి నివారణ కోసం బెజ్జంకిలో పలు వరి చేలను మంగళవారం ఏఓ సంతోష్ సూచించారు. ఈ సందర్భంగా ఆయన సాగులో మెళకువలను వివరించారు.